క్లుప్తంగా

నూతన యాగశాలలో హోమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నూతన యాగశాలలో శుక్రవారం విశేషంగా హోమాలను నిర్వహించారు. నూతన యాగశాలలో గణపతి హోమం, నవగ్రహ హోమం, రుద్రహోమం, మృత్యుంజయ హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. దసరా నేపథ్యంలో నూతన యాగశాలలో హోమాలు చేయించాలని తొలుత దేవస్థాన వైదిక కమిటీ నిర్ణయించింది. శుక్రవారం అమ్మవారికి విశేష పర్వదినం కావడంతో హోమాలను నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు నగరంలోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై ఓం సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో రెండో రోజు 486 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు ఆస్పత్రి గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తెలిపారు. భక్తులకు సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

శివకామేశ్వరీ సేవలో ఎంపీ బాబూరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు అందరికీ అందాలని ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాజ్యసభ ఎంపీ గొల్లబాబూరావు అన్నారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మహిమాన్వితమైన శివకామేశ్వరీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సకల వేద స్వరూపిణి

- వాడవాడలా దసరా ఉత్సవ శోభ
- గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేకపూజలు

ముగురమ్మలమూలపుటమ్మ కనకదుర్గమ్మ.. సకల వేదాలకు మూల స్వరూపమైన గాయత్రీదేవి అలంకారంలో.. భక్తులు మనసారా పూజించారు. శ్రీ దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం 'పశ్చిమ'లోని ఆలయాల్లో అమ్మవారు వేదమాతగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.



పాలప్రాజెక్ట్ సమీపంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



బ్రాహ్మణ వీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సంతానలక్ష్మిగా..




కొత్తపేట గంగానమ్మ ఆలయంలో..



కేబీఎన్ ప్రాంగణంలో గాయత్రీదేవిగా..



చిట్టినగర్‌లో గాయత్రిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



అప్పలస్వామి క్వారీ సెంటర్‌లో..



భవానీపురం కోళ్లఫారం రోడ్డులో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని 'పశ్చిమ'లోని పలు ఆలయాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. చిట్టినగర్ పరిధిలో భీమనవారి పేటలోని శ్రీ గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారిని శ్రీ గాయత్రిదేవిగా అలంకరించగా, ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవధ్యక్షులు సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిశెట్టి వెంకట దుర్గా శివ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

- మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. అమ్మవారిని కేంద్ర ఆర్థిక డెప్యూటీ డైరెక్టర్ రోహిన్ కొప్పురావూరి దర్శించుకున్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. ఉత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.
- పాలప్రాజెక్టు సమీపంలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వరస్వామి ఆలయంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన జరిగింది. సాయంత్రం అమ్మవారికి అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యం, పవన్‌కుమార్ శర్మలు పంచహారతుల సేవ చేశారు.

వన్‌టౌన్ పరిధిలో..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో భ్రమరాంబ అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఖడ్గమాల, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు ఇచ్చారు.

- బ్రాహ్మణవీధిలో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు.
- బ్రాహ్మణ వీధిలోని శ్రీ చదును మహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అష్టలక్ష్మిలు ఉపాలయంలో అమ్మవారు సంతానలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- పాతబస్తీలోని శేషయ్యవీధిలోని ప్రార్థనా మందిరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని శ్రీకృష్ణ భగవానునికి, సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ పర్యవేక్షించారు.
- కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీ గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.
- కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం అప్పలస్వామి క్వారీ సెంటర్‌లో శ్రీకనకదుర్గమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి ఆలయ సెట్టింగ్ భక్తులతోపాటు అందరినీ ఆకట్టుకుంటుంది. అమ్మవారి ఆలయ సెట్టింగ్ ప్రాంగణంలోకి అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఇక అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో దర్శించుకోగానే తన్మయులవుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం ఉభయదాతలతో చండీ హోమం, విశేష పూజలు, సాయంత్రం 6గంటలకు ముత్తయిదువులతో కుంకుమార్చన నిర్వహిస్తున్నారు.

- భవానీపురం కోళ్లఫారం రోడ్‌లో శ్రీగాయత్రి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున వచ్చి కొలిచారు. శనివారం కనకదుర్గమ్మ.. శ్రీఅన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు.
- ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో పోలేరమ్మ దర్శనమిచ్చి భక్తుల పూజలను అందుకున్నారు. శనివారం పోలేరమ్మ శ్రీగాయత్రి దేవిగా దర్శనమివ్వనున్నారని దేవస్థానం కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి తెలిపారు.
- భవానీపురం ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో శ్రీగాయత్రిదేవికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

క్యూలైన్‌లో నీటి ప్యాకెట్లు అందించండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): ఉత్సవాలకు వచ్చే భక్తులు దాహార్తితో ఇబ్బంది పడకూడదని, వారికి క్యూలైన్లలోనే తాగునీటి ప్యాకెట్లు అందించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి దసరా ఉత్సవాల విధుల్లో ఉన్న క్షేత్రస్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది ఎవరికి కేటాయించిన పాయింట్‌లో ఉన్న ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. తాగునీటి పాయింట్లు ఎప్పటికప్పుడు స్టాక్‌ని నిల్వ ఉంచుకోవాలని, గంటగంటకు స్టాక్ నివేదికను అందించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

అనాథాశ్రమాల్లోని వృద్ధులకు దుర్గమ్మ దర్శనభాగ్యం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని శుక్రవారం పలువురు వృద్ధులు దర్శించుకున్నారు. నగరంలోని పలు అనాథాశ్రమాల్లో జీవిస్తున్న వృద్ధులకు అమ్మవారి దర్శనం కల్పించాలని సీపీ రాజశేఖర్‌బాబును నిర్వాహకులు కోరారు. దీంతో శుక్రవారం సాయంత్రం 68 మంది వృద్ధులను పోలీసు సేవాదళ్ సభ్యులు ప్రత్యేక వాహనంలో కొండపైకి తీసుకువచ్చి ప్రత్యేక క్యూలైన్ మార్గంలో వారికి అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శన అనంతరం వారికి ప్రసాదాలను పంపిణీ చేశారు.

డెప్యూటీ సీఎంగా మత రాజకీయాలు చేయడం దుర్మార్గం

వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికలకు ముందు కులమతాల ప్రస్తావన లేని రాజకీయాలు చేస్తానని ప్రకటించిన జనసేనాని పవన్ కల్యాణ్, అధికారంలోకి వచ్చి బాధ్యతాయుతమైన డెప్యూటీ సీఎంగా ఉండి మత రాజకీయాలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగానికి లోబడి ఉంటానని ప్రమాణ స్వీకారం చేసిన పవన్ కల్యాణ్ ఒక మత ప్రతినిధిగా, ప్రచారకునిగా ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. స్థాయిని మరిచి వ్యవహరిస్తూ ఉప ముఖ్యమంత్రిగా తిరుపతి రాలేదని, మత ప్రతినిధిగా వచ్చానని అనడం ద్వారా ఆ పదవిని అవమానించడమేనని పేర్కొన్నారు. సనాతన ధర్మంపై మాట్లాడటమంటే కుల వ్యవస్థను ప్రోత్సహించడమే అవుతుందని తెలిపారు. సనాతన ధర్మం అంటే దళితులు, గిరిజనుల, మహిళలపై తరతరాలుగా పెరుగుతూ వస్తున్న కుల వివక్ష, అంటరానితనం, దాడులు, హత్యాచారాలకు వంతపాడుతున్న పవన్ కల్యాణ్ డెప్యూటీ సీఎం పదవికి అనర్హులని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని అవమానించిన ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు పాటుపడాలి

షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ పటిష్టతకు అందరూ పాటుపడాలని ఆ పార్టీ పీఏసీ సభ్యుడిగా నియమితులైన షేక్ ఆసిఫ్ అన్నారు. పార్టీ పొలిటికల్ అడ్వైజర్ సభ్యుడిగా నియమితులైన షేక్ ఆసిఫ్‌ను ఆయన కార్యాలయంలో పలువురు నాయకులు అభినందించి, శుభాకాంక్షలు అందించారు. కాఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవిని కేటాయించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం తన మాయలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. సూపర్‌సిక్స్ పేరుతో రాష్ట్ర ప్రజలను వంచించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యలకల చలపతిరావు, వినోద్ కుమార్, భాస్కర్ పలు విభాగాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



ఆసిఫ్‌ను అభినందిస్తున్న కార్పొరేటర్ చలపతిరావు, ఇతర నేతలు

హోంలోని బాలురకు ఉచిత న్యాయ సేవలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ రామకృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): జువెనైల్ హోంలోని బాలురకు ఉచిత న్యాయసేవలు అందిస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కేవీ రామకృష్ణయ్య చెప్పారు. కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాన్ని (జువెనైల్ హోమ్) రామకృష్ణయ్య శుక్రవారం సందర్శించారు. హోంలోని రికార్డ్స్‌ను పరిశీలించిన అనంతరం అక్కడ ఉంటున్న బాలురతో సంభాషించారు. హోంలో సౌకర్యాలతోపాటు వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్థోమత లేని బాలురకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే కొందరు పిల్లలు మత్తు పదార్థాలకు అలవాటు పడటం , నేరాలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఇలాంటి వాటి నుంచి బయటపడటానికి కౌన్సిలింగ్ నిర్వహించి పిల్లల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. హోంలోని పిల్లలు ఆన్‌లైన్ ద్వారా చెస్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారని అధికారుల ద్వారా తెలుసుకుని అభినందించారు. పిల్లలు ఇండోర్ గేమ్స్‌లో పాల్గొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హోం ఇన్‌టేక్ ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ పాల్గొన్నారు.



హోంలోని బాలురతో మాట్లాడుతున్న రామకృష్ణయ్య

ఆకట్టుకున్న సంప్రదాయ నృత్యాలు



విజయవాడ కల్చరల్: శరన్నవరాత్రుల్లో శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యాన కనకదుర్గానగర్‌లోని కళావేదికపై శుక్రవారం కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, కథక్, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, జానపదం, కరగం నృత్యాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన కళా బృందాలు ప్రదర్శించాయి. పలు కీర్తనలకు ఆర్.వాణీకుమారి, ఝాన్సీరాం, హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ సౌజన్య, సత్య ప్రసూన, జీఎల్ సంతోష నిహారిణి, స్వప్న, డి.మధుశ్రీ, మాధవి, విజయలక్ష్మి తమ బృందాలతో నృత్యాలను అభినయించారు. కార్యక్రమాలను సాంస్కృతిక విభాగం నిర్వాహకులు సైదా రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలను, అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందించారు.

జయహో జగజ్జనని



మహామండపం వద్ద అమ్మవారికి నమస్కరిస్తున్న భక్తులు



దుర్గగుడిలో మహామండపం వద్ద కుంకుమ పూజలో భక్తులు





అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

జయహో జగజ్జనని అంటూ భక్తులు వేదమాతను స్మరించారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం గాయత్రీ అలంకారంలో అమ్మవారిని దర్శించుకుని భక్తి పారవశ్యం చెందారు. క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలుగా మారాయి. ముగురమ్మల మూలపుటమ్మకు కుంకుమార్చనలు చేశారు. అమ్మవారికి అర్చకులు హారతులు ఇచ్చారు. భక్తులు క్యూలో వెళ్లి అన్నప్రసాదం స్వీకరించారు. రాత్రికి అమ్మవారి నగరోత్సవం కనులపండువగా జరిగింది. అమ్మవారిని కనులారా దర్శించుకున్న భక్తులు పులకించిన మదితో ఇళ్లకు వెనుతిరిగారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఆశీస్సులివ్వు తల్లీ..



అమ్మవారికి హారతులు









నమస్కరిస్తున్న అర్చకుడు : దుర్గగుడి కొండపై మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని : వృద్ధురాలిని దర్శనానికి తీసుకెళ్తున్న పోలీస్ : లేజర్ షో

నీటి గుంతలో శవమై తేలిన యువకుడు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):నీటి గుంతలో పడి యువకుడు శవమై కనిపించిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లిలో చోటు చేసుకుంది. అంబేద్కర్ కాలనీకి చెందిన కూరపాటి నాగరాజు (20) వివాహం కాగా వేరుగా నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం నాగరాజు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి వస్తానని చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. కొంత సమయం తర్వాత నాగరాజు ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో నాగరాజు కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, గ్రామంలో వెతికారు. గ్రామ శివారులోని మామిడి తోట వద్ద క్వారీ గుంట వద్ద నాగరాజు చెప్పు కనిపించడంతో క్వారీ గుంతలో వెతకడం ప్రారంభించారు. శుక్రవారం ఉదయం నాగరాజు శవమై నీటిలో కనిపించడంతో ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బలమైన పునాదులతో అద్భుత విజయాలు



మాట్లాడుతున్న రామచంద్రప్రభు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యువ పారిశ్రామికవేత్తలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో బలమైన పునాదులను ఏర్పరచుకుంటేనే అద్భుత విజయాలను సొంతం చేసుకుంటారని తులసీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసీ రామచంద్రప్రభు అన్నారు. కాకరపర్తి భావనారాయణ పీజీ కళాశాల బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో మీట్ ది సీఈవో కార్యక్రమం జరిగింది. దీనిలో భాగంగా శుక్రవారం తులసీ రామచంద్రప్రభుతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులు, ఉద్యోగులు, సరఫరాదారులు, బ్యాంకర్లు నాలుగు ప్రధాన వాటాదారులతో ఏ వ్యాపారమైనా విజయపథంలో ముందుకు సాగుతుందన్నారు. శ్రమించడం, ప్రతిభకు పదును పెట్టడం, సృజనాత్మకంగా ముందుకు వెళ్లినప్పుడు మాత్రమే విజయాలు సొంతమవుతాయన్నారు. విద్యార్థులు అవకాశాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ రామచంద్రప్రభు జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేష్, ఎంబీఏ విభాగాధిపతి ఏ రవికిరణ్ యుజీ కామర్స్ విభాగాధిపతి ఎన్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.